సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



టీడీపీ నేతలు కళ్లకు గంతలు కట్టుకున్నారా.!

కడపలో వేలకోట్లతో అభివృద్ధి జరుగుతుంటే టీడీపీ నేతలు కళ్లకు గంతలు కట్టుకున్నారా అని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. -10లో



భార్యను హత్య చేసిన కానిస్టేబుల్

పులివెందుల పట్టణంలోని జెండామాను వీధి సమీపంలో నివాసముంటున్న బైరి వసుంధర అలియాస్ జానకి (30)ని ఆమె భర్త, కానిస్టేబుల్ బైరి బాలవాను హత్య చేశాడు. -10లో

గరిష్టం/కనిష్టం
30.7/18.9

వాతావరణం

జిల్లాలో గురువారం 18.9 – 30.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నూతన నియామకం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో జిల్లాకు చెందిన పలువురికి చోటు లభించింది. స్టేట్ బీసీ విభాగం కార్యదర్శిగా బోజనపల్లె భారతి, స్టేట్ మైనార్టీ విభాగం కార్యదర్శులుగా వేంపల్లి బాబు సాహెబ్, షేక్ ఇస్మాయిల్, స్టేట్ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శిగా గంగల వీరాంజనేయులు, కార్యదర్శిగా కామిశెట్టి క్రిష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీలుగా చవ్వల వెంకటేశ్వర్లు, కొత్త రామక్రిష్ణ, స్టేట్ చేనేత విభాగం ఉపాధ్యక్షురాలిగా జింకా విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా పి. వెంకట సుబ్బరాయుడులను నియమించారు.

నేటినుంచి ఆకేపాటి 21వ తిరుమల మహా పాదయాత్ర



జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్: జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో 21వ తిరుమల మహా పాదయాత్ర శుక్రవారం ప్రారంభం కానుంది. మండల పరిధిలోని ఆకేపాడులో గల ఆలయాల సముదాయం వద్ద ఉదయం 10 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం టీటీడీ వేద పండితులచే నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందజేస్తారు. తర్వాత మధ్యాహ్నం 2గంటల సమయంలో పాదయాత్ర ప్రారంభిస్తారు. రాత్రి 7 గంటలకు ఊటుకూరు సమీపంలోని అశోక్ గార్డెన్ వద్దకు చేరుకుంటుంది. అక్కడ భక్తులకు అల్పాహారం అందజేస్తారు. 16వ తేదీ ఉదయం 4.30 గంటలకు తిరిగి ప్రారంభమవుతుంది. పుల్లంపేట, ఓబులవారిపల్లి, రైల్వేకోడూరు మండలాల మీదుగా కొనసాగుతుంది. 18వ తేదీ ఉదయం 6గంటలకు పదకవితా పితామహుడు అన్నమయ్య నడయాడిన కాలిబాటలో అటవీ మార్గం గుండా పాదయాత్ర తిరుమలకు చేరుకుంటుంది. రాత్రి శ్రీవారిని దర్శించుకుంటారు.

ఉచిత వైద్యానికి ఊపిరి

ప్రభుత్వం ఎప్పటికప్పుడు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీని బలోపేతం చేస్తూ వస్తోంది. తాజాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకానికి మరింత ఊపిరి పోశారు. పెద్ద జబ్బులకు సైతం ఒక పైసా ఖర్చు లేకుండా నిశ్చింతగా ఉచిత వైద్య సేవలను పొందేలా చర్యలు చేపట్టారు. పేదలు ఆర్థికంగా చితికి పోకుండా ప్రభుత్వం ఆపన్నహస్తం అందిస్తోంది.

- వైద్య వ్యయం ప్యాకేజీ రూ 25 లక్షలకు పెంపు
- 5.83 లక్షల కుటుంబాలకు కొత్త కార్డులు
- 18న ప్రారంభోత్సవం.. 20 నుంచి ఇంటింటికీ కార్డుల పంపిణీ



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ జిల్లా కార్యాలయం

కడప రూరల్: దేశ చరిత్రలోనే ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వం రాష్ట్రంలో వైద్య రంగానికి పెద్ద పీట వేసింది. ప్రధానంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకంలో ఎప్పటికప్పుడు ఆరోగ్యకరమైన మార్పులను తెచ్చి, పేదల ఆరోగ్యానికి అభయమిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా ఆరోగ్య శ్రీ కింద వైద్యానికి అయ్యే వ్యయాన్ని ఏడాదికి ఒక కుటుంబానికి రూ 5 లక్షల వరకు ఉన్న ప్యాకేజీని రూ 25 లక్షలకు పెంచడం విశేషం. ఈ పెంపు వల్ల పథకంలో ఉన్న మొత్తం 2,325 వ్యాధులకు వర్తిస్తుంది. అలాగే సాధారణ రోగాలకే గాక ఖరీదైన..పెద్ద జబ్బులైన క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన కీమో థెరపీ, రేడియో థెరపీ, కిడ్నీ తదితర వ్యాధిగ్రస్తులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఒక వేళ వర్తించే జబ్బుల చికిత్సలో వ్యయం ఎక్కువైనా కూడా మన చేతి నుంచి డబ్బులు చెల్లించకుండా అభ్యర్థన ద్వారా ఆరోగ్య శ్రీ ట్రస్ట్ నుంచి ప్రయోజనం పొందవచ్చు. కాగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగానికి సంబంధించిన ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులు మొత్తం 169 ఉన్నాయి.

కొత్త కార్డులు పంపిణీ...

ఆరోగ్య శ్రీ ద్వారా నేరుగా నెట్ వర్క్ ఆసుపత్రులకు వెళ్లి ఉచిత వైద్య సేవలను పొందడానికి కొత్త కార్డుల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం ఒక కుటుంబానికి ఒక కార్డును మంజూరు చేస్తారు. జిల్లాలో 5.83 లక్షల కుటుంబాకు కొత్తగా రూపొందించిన డిజిటల్ కార్డులను అందజేస్తారు. అంటే ఒక కార్డులో ఉదాహరణకు ముగ్గురు లేదా నలుగురు సభ్యులు ఉంటే దాదాపు 17 లక్షల మందికి పైగా ప్రయోజనం చేకూరనుందని అంచనా..ఇందుకు సంబంధించి ఈ నెల 18వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభోత్సవం చేస్తారు. ఆ రోజు జిల్లా వ్యాప్తంగా ఒక నియోజక వర్గంలోని ఒక సచివాలయంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు.. 20వ తేదీ నుంచి స్థానిక ఏఎన్ఎం, సీహెచ్ఓల ద్వారా ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారికి కార్డులను అందజేయడానికి చర్యలు చేపట్టారు..

'ఆరోగ్య శ్రీ'ప్యాకేజీ పెంపు వివరాలు

ముఖ్యమంత్రులు	ప్యాకేజీ (రూ.లక్షల్లో)
డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి	2.50
చంద్రబాబునాయుడు	2.50
వైస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రారంభంలో	5
తాజాగా	25

టీడీపీ పాలనలో అస్తవ్యస్తం...

2007లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. దీంతో పెద్ద పెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో లక్షలాది మంది ఉచితంగా వైద్య సేవలు పొంది..పునర్జన్మ పొందారు. చంద్రబాబునాయుడి పాలనలో ఈ పథకం నిలువెల్లా అస్తవ్యస్తంగా సాగింది. అనంతరం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు.

సచివాలయం ద్వారా కార్డును పొందవచ్చు



ఎవరికైనా సరే కార్డులు రాకున్నా, నిబంధనల ప్రకారం అర్హులైన వారు ఉంటే స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే కొత్త కార్డులు పొందవచ్చు. అలాగే అర్హులైన వారికి కార్డు లేనప్పుడు ఎవరైనా అనారోగ్యానికి గురైతే సబంధింత ఆసుపత్రిలోని ఆరోగ్య మిత్ర డెస్క్ ద్వారా సీఎంసీఓకు ఒక లెటర్‌ను పెడితే జిల్లా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయం ద్వారా ఉచిత చికిత్సకు అనుమతిని ఇవ్వడం జరుగుతుంది. – డాక్టర్ బాలాంజనేయులు, జిల్లా కో ఆర్డినేటర్, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి

కలెక్టర్ విజయరామరాజు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయరామరాజు, మేయర్ సురేష్‌బాబు తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : విద్యుత్ చాలా విలువైనదని, దానిని పొదుపుగా వినియోగించి వృథాను అరికట్టాలని కలెక్టర్ విజయరామరాజు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్, కడప నగర మేయర్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంధన శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల కార్యక్రమం భవిష్యత్తు తరాలకు వనరులను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రజలకు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించేందుకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను డిసెంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు జరుపుతున్నట్లు తెలిపారు. ఎపీఎస్పీడీసీఎల్ రమణ మాట్లాడుతూ జిల్లా ప్రజల్లో విద్యుత్ ఆదా అవసరాన్ని, వనరుల పరిరక్షణ గురించి అవగాహన పెంపొందించేందుకు విద్యుత్ పరిరక్షణ వారోత్సవాలను చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ ఆదా చేయడం వలన ఇంధన డిమాండ్ తగ్గి తద్వారా బొగ్గు, చమురు, గ్యాస్ వాడకము తగ్గి వాతావరణంలో కర్బన రసాయన కాలుష్యాలను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెక్నికల్) హరి సేవ్య నాయక్, విజిలెన్స్ ఇన్స్పెక్టర్ భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను గడువులోగా అధిగమించాలి

జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులను నిర్దేశించిన లక్ష్యం మేరకు గడువులోగా అధిగమించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రెవెన్యూ, రీసర్వే, ఎంపీఎఫ్సి గోడౌన్లకు భూకేటాయింపు, వ్యవసాయం, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్మెంట్, హౌసింగ్, ఇంటి పట్టాలు, ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కెఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సంబంధిత అంశాలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. వీసీ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

భక్తులకు 'కానుక'



ఆధునిక సాంకేతికత అంతటా యమ వేగంగా అల్లుకుపోతూ ఉంది. ప్రస్తుతం ఆన్‌లైన్ చెల్లింపుల యుగం నడుస్తోంది. అందులో భాగంగా ఫోన్ పే, గుగూల్ పే, పేటీఎం తదితర పద్ధతుల్లో ప్రజలు సొమ్ము చెల్లింపు, ఇతర లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఇందుకు క్యూఆర్ కోడ్‌ను కూడా అనుసరిస్తున్నారు. ఈ పద్ధతిని ఓ ఆలయ నిర్వాహకులు కూడా అందిపుచ్చుకున్నారు. భక్తులు నగదు అందుబాటులో లేదని సరిపుచ్చుకొని వెళ్లిపోకుండా క్యూఆర్ స్కానింగ్ పద్ధతి కూడా అందుబాటులో ఉందని తెలుపుతూ హుండీపై స్టిక్కర్‌ను ఏర్పాటు చేశారు. హుండీలో కానుకగా వేసేందుకు నగదు అందుబాటులో లేని భక్తుల కోసం ఈ క్యూర్ కోడ్‌ను 'కానుక'గా ఏర్పాటుచేశారు. –కడప కల్చరల్

నెట్టింట్లో మారీచులు

ఎక్కడ ఉంటారో..ఎలా ఉంటారో..ఎవరిని, ఎలా మోసం చేస్తారో కూడా తెలియదు. మోసం ఎలా జరుగుతుందో గుర్తించలేం. తెలిసే సరికి మోసపోతాం. ఒకసారి మోసపోయాక కోలుకోవడం కష్టం. ప్రస్తుతం మారుమూలలకు సైతం ఇంటర్నెట్ సౌకర్యం లభించడంతో సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగింది. అదే సమయంలో సైబర్ నేరాల సంఖ్య కూడా పెరిగిపోతోంది. కొన్ని ఉదంతాలు గమనిస్తే రామాయణంలో సీతాపహరణ సందర్భంగా బంగారులేడి వేషంలో మారీచుడు చేసిన మోసం గుర్తుకురాక మానదు.

- మోసాలకు వేదికగా సోషల్ మీడియా
- కొత్త పంథాలో సైబర్ నేరాలు
- యాప్ 'డబుల్'తో మోసాలు
- వాట్సాప్ మెసెంజర్లతో గాలం
- వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించి బెదిరింపులు
- నకిలీ ఐడీలతో తప్పుదోవ



సాక్షి, కడప డెస్క్: సామాజిక మాధ్యమం.. ఇపుడు ప్రపంచాన్ని ఏకం చేస్తున్న ఏకైక మార్గం. అన్ని వర్గాలకు ఉపయోగపడే అంశాలను వ్యాప్తి చేస్తోంది. రోజు రోజుకూ ఆధునికతను సంతరించుకుంటూ రెండు వైపులా పదునున్న కత్తిలా మారింది. ఇటీవలికాలంలో తరాల అంతరం లేకుండా సోషల్ మీడియాను అధికంగా వాడుతున్నారు. వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, ట్విట్టర్ తదితర మాధ్యమాలలో తమ భావాలను పంచుకునేవారి సంఖ్య పెరిగింది. ప్రతి ఒక్కరికీ కచ్చితంగా సోషల్ మీడియా ఖాతా ఉంటోంది. అయితే సోషల్ మీడియా మంచికి ఎంత ఉపయోగపడుతోందో.. మరోవైపు వేరొకరి పరువు తీసేందుకు, బెదిరించి లేదా మోసం చేసి డబ్బు దండుకోవడానికి కూడా వేదిక అవుతోంది. చాలామంది యూజర్లు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల మోసగాళ్ల వలలో చిక్కుకుంటున్నారు. అడ్డదారిలో డబ్బు సంపాదించుకోవడానికి సోషల్ మీడియాను మార్గంగా ఎంచుకున్నవారు తమ ఉనికి బయట పడకుండా జాగ్రత్తలు తీసుకుంటూ వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. ఎప్పటికప్పుడు రూపు, రూటు మార్చి మోసాలకు తెగబడుతున్నారు.

నకిలీ ఐడీతో మోసానికి రెడీ

తాము ఎంచుకున్న వారి ఫొటోతో ఫేస్‌బుక్ తదితర యాప్‌లకు నకిలీ ఐడీ రూపొందిస్తారు. అది అచ్చం అసలు ఖాతాలా భ్రమించేలా చేస్తారు. దాని నుంచి సంబంధిత వ్యక్తి బంధువులు, స్నేహితులకు డబ్బు పంపించమంటూ మెసేజ్‌లు చేసి మోసగిస్తారు. మరికొందరైతే ఖాతాల పాస్‌వర్డ్‌లను సంపాదించి, ఆ వ్యక్తి వివరాలు, ఫొటోలను తస్కరిస్తారు. వాటి ఆధారంగా అసభ్యకర మెసేజ్‌లు, ఇమేజ్‌లు తయారుచేసి బ్లాక్‌మెయిల్ చేస్తూ వివిధ రకాలుగా బెదిరిస్తున్నారు.

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటికి చెందిన ఎస్.జాబీర్(యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి) ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సాంకేతిక కారణాల వల్ల గత ఆది, సోమవారాల్లో ఎస్‌బీఐ ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఇంతలో ఎస్‌బీఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో నకిలీ ఎస్‌బీఐ లింక్ ప్రత్యక్షమైంది. ఇది నమ్మిన జాబీర్ అచ్చు ఎస్‌బీఐ యాప్‌ను తలపించిన ఆ నకిలీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. బ్యాంకు అకౌంట్‌కు సంబంధించిన వివరాలతో లాగిన్ అయ్యారు. వెంటనే ఆయన అకౌంట్‌లోని నగదు మాయమైంది. యాప్ డబుల్‌తో మోసం చేశారని గ్రహించిన ఆయన తనతో పాటు మరికొందరు ఉపా ధ్యాయులు కూడా ఇలాగే మోసపోయారని గుర్తించారు. వారితో కలిసి వెళ్లి రాయ చోటి స్పెషల్ బ్రాంచ్ సీఐ సత్యనారాయణకు తాము మోసపోయిన విధానాన్ని వివరిస్తూ ఫిర్యాదు చేశారు.

కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ డీపీ(డిస్‌ప్లే పిక్చర్)తో సైబర్ మోసగాళ్లు మోసగించే యత్నం చేశారు. వాట్సాప్ చాటింగ్ ద్వారా ఆయన పరిచయస్తులతో కాంటాక్ట్‌లోకి వెళ్లారు. క్షేమ సమాచారాలు అడిగినట్లుగా మెసేజ్‌లు పంపసాగారు. దీంతో వీసీ అప్రమత్తమయ్యారు. మోసగాళ్ల మెసేజ్‌లకు ఎవరూ స్పందించవద్దని రెండు రోజుల క్రితం ఆయన వైవీయూ గ్రూపుల్లో, వ్యక్తిగతంగా అందరికీ మెసేజ్‌లు పంపారు.

మనీ రిక్వెస్ట్ ఫ్రాడ్

ఈ స్కామ్‌లో, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్ (యూపీఐ) ద్వారా మనీ సెండ్ చేసేలా హ్యాకర్లు ప్రజలను మోసం చేస్తారు. వారు ఫేక్ మనీ రిక్వెస్ట్‌లు పంపడం లేదా చట్టబద్ధమైన సంస్థల వలె నటించడం వంటి వ్యూహాలు పన్నుతారు. యూపీఐ మనీ రిక్వెస్ట్ ఫ్రాడ్‌కి గురైతే ఆర్థిక నష్టాలు, భద్రతా సమస్యలు తలెత్తుతాయి.


బ్యాంక్ అకౌంట్ డీయాక్టివేషన్ స్కామ్

స్కామర్లు అనుమానాస్పద యాక్టివిటీ వల్ల బ్యాంక్ అకౌంట్ డీయాక్టివేట్ అయిందని సంప్రదిస్తారు. సాధారణంగా ఆటోమేటిక్ కాల్స్ లేదా టెక్స్ట్ మెసేజ్‌లతో ప్రారంభిస్తారు. స్పెసిఫిక్ నంబర్‌కు కాల్ చేయమని లేదా ఐడెంటిటీ వెరిఫికేషన్‌కి లింక్‌పై క్లిక్ చేయమని కోరుతారు. పర్సనల్, ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ అందిస్తే బ్యాంకు అకౌంట్‌లో డబ్బు మాయమవుతుంది.

ఓటీపీ స్కాం

ఓటీపీ స్కాంలో టూ-ఫ్యాక్టర్ అథెంటిఫికేషన్ కోసం ఉపయోగించే వన్-టైమ్ పాస్‌వర్డ్‌లను(ఓటీపీ) ప్రజల నుంచి తెలుసుకునేందుకు వివిధ పద్ధతులను ఉపయోగిస్తారు. మోసగాళ్లు ఆథరైజ్డ్ ఎంటిటీస్‌గా నటించడం, హానికరమైన లింక్‌లను పంపడం లేదా బ్యాంకుల వద్ద బాధితులుగా నటించడం వంటి వ్యూహాలను ఉపయోగిస్తారు. స్పందించినవారి ఖాతాల నుంచి డబ్బు లాగేస్తారు.

లైక్, సబ్‌స్క్రైబ్ అంటూ ..



కరోనా ఉధృతి వేళ ఇంటి నుంచి పనిచేసే విధానానికి బాగా ఆదరణ పెరిగింది. . దీంతో వర్క్ ఫ్రం హోం కొలువుల కోసం అంతర్జాలంలో అన్వేషించడం ఎక్కువైంది. ఇలాంటి వారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసగాళ్లు 'తక్కువ పని గంటలు... ఎక్కువ సంపాదన'అంటూ డిజిటల్ ప్రకటనలు గుప్పిస్తున్నారు. వీరిని ఎవరైనా సంప్రదిస్తే డేటా ఎంట్రీ, ప్రముఖుల సామాజిక మాధ్యమ ఖాతాల్లో వచ్చే పోస్టులను లైక్, షేర్ చేయడంవంటి పనులు ఉంటాయని చెబుతున్నారు. పని సులభమని, వేలల్లో సంపాదించుకోవచ్చని చెబుతూ నకిలీ వెబ్‌సైట్లతో ముగ్గులోకి దించుతున్నారు. మీకు అధిక ఆదాయం కావాలంటే కొంత పెట్టుబడి పెట్టాలంటూ వల విసురుతున్నారు. వారి నుంచి డబ్బులు వచ్చిన తరువాత వెబ్‌సైట్లను మూసేస్తున్నారు. ఆన్‌లైన్ ఆఫర్లతో జనాన్ని ముంచేస్తున్న 36 లక్షల వాట్సాప్ ఖాతాలను నిషేధించామని కేంద్ర ఐటీ మంత్రి ఆ మధ్య ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

సురక్షితంగా ఉండటం ఎలా?



- వ్యక్తిగత సమాచారం, ఆర్థిక వివరాలను కోరుతూ, వెంటనే స్పందించాలని చెబుతూ సెండ్ చేసిన ఈ మెయిల్స్‌ను నమ్మకూడదు. తెలియని సోర్సెస్ నుంచి వచ్చిన లింక్‌లపై క్లిక్ చేయకూడదు, అందులో ఉన్న ఎలాంటి ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయకూడదు.
- సోషల్ సెక్యూరిటీ నంబర్‌లు లేదా బ్యాంక్ ఖాతా, పాన్‌కార్డు, ఆధార్ వంటి వివరాలను మోసగాళ్ల చేతిలో పడకుండా జాగ్రత్త వహించాలి. సున్నితమైన పర్సనల్ డేటాని అవసరమైతే తప్ప, ఎవ్వరికీ షేర్ చేయకూడదు.
- సెండర్ లేదా వెబ్‌సైట్ అథెంటిసిటీని ఎల్లప్పుడూ చెక్ చేయండి. ఫోన్ నంబర్‌లు, ఇమెయిల్ అడ్రస్‌లు, డొమైన్ నేమ్స్, సెండర్ ఐడెంటిటీ తెలుసుకోవాలి. తాజా ఆన్‌లైన్ స్కామ్‌లు, మోసాల గురించి మీడియా ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌లు, లాటరీ లేదా ప్రైజ్ స్కామ్‌లు, రొమాన్స్ స్కామ్‌లు, టెక్ సపోర్ట్ స్కామ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. వార్నింగ్ సైన్స్, రెడ్ ఫ్లాగ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.
- కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్, ఇతర డివైజ్‌లు లేటెస్ట్ సెక్యూరిటీ ప్యాచ్‌లు, యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌తో అప్‌డేటెడ్‌గా ఉంచుకోవాలి.
- సామాజిక మాధ్యమాలను వినియోగించేవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. పబ్లిక్ వైఫైను ఉపయోగించకూడదు. దీని వల్ల వ్యక్తిగత సమాచారానికి భద్రత ఉండదు. మన మొబైల్ నుంచి వెళ్లే వాటిని హ్యాక్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఖాతాల్లోని ఫొటోలు, పాస్వర్డ్, తదితర వివరాలు, ఇతరులకు చేరే ప్రమాదం ఉంది.
- కంప్యూటర్లలో, మొబైళ్ల, ట్యాబ్లలో సోషల్ మీడియా యాప్స్, సైట్లను తెరిచినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తిరిగి సరైన రీతిలో లాగ్ అవుట్ చేయాలి. లేనిపక్షంలో సంబంధిత ఖాతా తెరిచే అవకాశం ఉంటుంది. ఇది కొందరు మోసగాళ్లకు తాళం చెవిని ఇచ్చినట్లే.
- మొబైల్‌కు కూడా సోషల్ మీడియా యాప్స్‌లా పాస్వర్డ్, లాక్ పెట్టుకోవాలి. అపరిచితుల నుంచి రిక్వెస్టులు వస్తే అంగీకరించకూడదు.
- ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ తదితర వాటిని వినియోగించే సందర్భంలో రక్షణ కోసం ఆయా కంపెనీలు పలు చర్యలు చేపట్టాయి. రెండు దశల ధ్రువీకరణను ఆన్ చేసుకోవాలి. దీని వల్ల ఇతరులు మన ఖాతాల్లోకి చొరబడేందుకు వీలుండదు. బోగస్ ప్రొఫైల్స్, ఐడీలు తారసపడిన వెంటనే ఆ సంస్థకు పిర్యాదు చేయాలి. వారు అటువంటి ఖాతాలను స్తంభింపజేస్తారు. ముఖ్యంగా తాము మోసపోతున్నామని గ్రహించే క్రమంలోనే పోలీసులను ఆశ్రయిస్తే ఫలితముంటుంది.


రామయ్యను దర్శించుకున్న న్యాయమూర్తి



రామయ్య ప్రధాన గోపురం వద్ద జడ్జి బబిత

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులను గురువారం రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ(అమరావతి) మెంబర్ సెక్రటరీ(డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి) ఎం.బబిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆమెకు లాంఛనాలతో స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షణ కావించి, గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె రంగమండపంలో సేద తీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆమె వెంట కడప డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జ్ షేక్ బాబా ఫక్రుద్దీన్, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్సై మధుసూదన్ రావు, సిద్ధవటం కోర్ట్ సిబ్బంది ఉన్నారు.

రేషన్ సరుకులు పొందేందుకు వెసలుబాటు



కడప సెవెన్‌రోడ్స్: రేషన్ కార్డు దారులు సరుకులు పొందేందుకు మరింత వెసలుబాటు కల్పించినట్లు కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ జరుగుతోందన్నారు. అయితే వివిధ కారణాలతో ఇంటి వద్ద రేషన్ సరుకులు పొందలేని వారు ప్రతినెల 17వ తేదిన వారి పరిధిలోని సచివాలయం వద్ద అందుబాటులో ఉండే ఎండీయూ వాహనం ద్వారా పొందే వెసలుబాటును కల్పించారన్నారు. ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా టోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని కలెక్టర్ వివరించారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


ఉత్తన్న (ఫైల్)

వేంపల్లె : చక్రాయపేట మండలం కొండవాండ్లపల్లె గ్రామానికి చెందిన రైతు కేశినేని ఉత్తన్న(75) గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తన్నకు 4ఎకరాల వరి పొలం ఉంది. రోజు మాదిరిగానే తమ పంట పొలాలను చూసేందుకు వెళ్లాడు. ఆ క్రమంలో గట్టు దాటుతుండగా జారి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్ల మీద పడ్డాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పొలానికి వెళ్లిన ఉత్తన్న మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం చుట్టూ వెతికేందుకు వెళ్లారు. అక్కడ విద్యుత్ షాక్‌కు గురైనట్లు గమనించి విద్యుత్ అధికారులకు ఫోన్ చేశారు. వెంటనే సంబంధిత అధికారులు విద్యుత్ లైన్‌ను ఆఫ్ చేసి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గాలేరు-నగరి కాలువలో గుర్తుతెలియని మృతదేహం

ముద్దనూరు : మండలంలోని చిన్న దుద్యాల గ్రామ సమీపంలో గాలేరు-నగరి ప్రధాన కాలువలో గుర్తుతెలియని ఓ వ్యక్తి(30) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. గురువారం సాయంత్రం కాలువలో ఓ మృతదేహం తేలియాడుతూ ఉండడంతో ఎస్ఐ చంద్రమోహన్ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు.

యువకుడి ఆత్మహత్య

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం కోళ్లబైలుకు చెందిన ఓంప్రకాష్‌రెడ్డి(23) అనే యువకుడు బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె సిటీ: కుటుంబ సమస్యల కారణంగా ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన తంబళ్లపల్లె మండలం బలకవారిపల్లెలో గురువారం జరిగింది. బలకవారిపల్లెకు చెందిన మహమ్మద్‌ఖా (23) ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

టీడీపీ నేతలు కళ్లకు గంతలు కట్టుకున్నారా.!

- సిగ్గు, శరం లేకుండా ఆరోపణలు చేయడం దారుణం
- ఎక్కడి నుంచో తరిమేస్తే ఇక్కడికొచ్చి రాజకీయాలు చేస్తున్నారు
- ఐదేళ్లు ఇన్‌చార్జిగా ఉండి కడప అభివృద్ధికి రెండు పైసలు తెచ్చావా..
- టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డిపై ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా ధ్వజం


మీడియాతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కడప నగరంలో వేలకోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుంటే టీడీపీ నేతలు కళ్లకు గంతలు కట్టుకున్నారా...అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డికి తన గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ఎక్కడి నుంచో తరిమేస్తే ఇక్కడికొచ్చిపడి తనపై సిగ్గూ, శరం లేకుండా ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మీ అబ్బ రాజకీయంగా ఉన్నతంగా ఉంటే...రాయచోటిలో మీ కుటుంబాన్ని ప్రజలు ఎందుకు తరిమేశారు...వరుసగా మిమ్మల్ని ఎందుకు ఓడించారో చెప్పాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జిల్లా అధ్యక్షుడిగా, కడప ఇన్‌చార్జిగా ఉన్నావ్ కదా ఏం పీకావ్...నీ పార్టీని, పార్టీ నాయకులను నామరూపాల్లేకుండా చేశావంతే అంటూ తీవ్ర స్థాయిలో స్పందించారు. కడప ఇన్‌చార్జిగా ఉండి ఈ ప్రాంత అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చావో చెప్ప గలవా అని నిలదీశారు. మీ అధినేత చంద్రబాబుతో ఆలంఖాన్‌పల్లెలో మీటింగ్ పెట్టి రూ.2కోట్లు నిధులిస్తామని చెప్పించావ్...రెండు పైసలైనా తెచ్చావా...నగర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నీరు-చెట్టు పథకంలో ఒక జేసీబీ పెట్టి బుగ్గవంక తోడేసి కోట్ల రూపాయలు పందికొక్కుల్లా దోచుకుతున్నారని ఇదే మీరు చేసిన ఘన కార్యమన్నారు. కడపలో వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుంటే మీకేమైనా పచ్చకామెర్లు వచ్చాయా అని ప్రశ్నించారు. నగరంలో ఎక్కడెక్కడ ఏఏ నిధులతో పనులు జరుగుతున్నాయో శ్వేత పత్రం ఇదివరకే విడుదల చేశానని అది చదువుకొని, ఆ తర్వాత మాట్లాడాలన్నారు. తాను ఈ పదేళ్లలో వేల కోట్లు సంపాదించలేదని ప్రజల్లో మంచిపేరు మాత్రమే సంపాదించానని చెప్పారు. అబ్బగారు, నాన్నగారు సంపాదించిన ఆస్తులు తమకు లేవని, తమ తండ్రి తాము గౌరవప్రదంగా బతికేందుకు మాత్రమే కొన్ని ఆస్తులు ఇచ్చి పోయారని, వాటితో తాము వ్యాపారాలు చేసి బతుకుతున్నామన్నారు. తాము శ్రీనివాసులరెడ్డిలాగా ఏ ఎండకు ఆ గొడుగు పట్టేరకం కాదని ఒక్క నాయకుడినే నమ్ముకుంటామని, అప్పుడు వైఎస్సార్, ఇప్పుడు వైఎస్ జగన్‌ను నమ్ముకున్నామన్నారు. ఊపిరి ఉన్నంత వరకూ ఆయనతోనే ఉంటామన్నారు. నీ చరిత్ర ఏంటి...నీవు ఎవరెవరి దగ్గర ఉన్నావో, ఎవరితో పనులు చేయించుకున్నావో తెలియదా...అని ధ్వజమెత్తారు. తన చరిత్ర తెరిచిన పుస్తకమని, నగర ప్రజలందరికీ తన గురించి తెలుసన్నారు. కుల, మతాలకు, ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా నడుచుకోవడం తమ నైజమన్నారు. ఈ పదేళ్లలో కడప ప్రజల అభిమానం, ఆశీర్వాదం అందుకున్నందుకు గర్వంగా భావిస్తున్నానన్నారు. టీడీపీలో కూడా తనకు అభిమానులున్నారన్నారు. ఎక్కడి నుంచో దిగుమతి చేసుకున్న నాయకులు కాకుండా పార్టీ ఆవిర్భావం నుంచి జెండాలు మోసిన వారెవరూ లేరా...ఏమైపోయారు...ఎక్కడినుంచో తరిమేస్తే వచ్చిన నాయకులకు ఆ పార్టీ వారు కొమ్ము కాయడం దారుణమన్నారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు కళ్లు తెరిచి కడపలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూడాలని హితవు పలికారు.



చదువుకు పెద్దపీట



నా భర్త నాగేశ్వర రావు ఏడేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. అప్పటి నుంచి అమ్మగారి ఊరైన ఎర్రగుంట్లలో తోపుడు బండిపై పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాను. మా కుమారుడు చల్లా నాగభవేష్ ఎర్రగుంట్ల పట్టణం శ్రీరాముల పేటలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకం గత నాలుగేళ్లుగా వస్తోంది. ఏడాదికి రూ.15 వేలు ఖాతాలో జమ అవుతోంది. ఈ పథకం వర్తిస్తుండటంతో మా కుమారుడు బాగా చదువుతున్నాడు. అంతే కాక నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించారు.

– చల్లా విజయలక్ష్మి, ఎర్రగుంట్ల.

సొంతింటి కల నెరవేరింది



మాది చెన్నూరు మండలం కొండపేట గ్రామం. 20 ఏళ్ల క్రితం బద్వేలుకు వచ్చి చిన్నపాటి హోటల్ నిర్వహించుకుంటూ అద్దె ఇంట్లో ఉంటున్నాం. హోటల్ నిర్వహణతో వచ్చే ఆదాయంతో ఇంటి అద్దె చెల్లిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాళ్లం. గతంలో ఇంటి కోసం చాలాసార్లు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మా వార్డు వలంటీర్ సుబ్బయ్య ఇంటి వద్దకు వచ్చి మీకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరైందని చెప్పాడు. వల్లెరవారిపల్లె లేఅవుట్‌లో ఇంటి నిర్మాణం పూర్తయింది. త్వరలోనే ఇంటిలో చేరబోతున్నాం. మామూలుగా అక్కడ స్థలం కొనుగోలు చేయాలంటే రూ.లక్షల్లో ఖర్చవుతుంది. అంత విలువైన స్థలం మాకు ఉచితంగా ఇవ్వడంతో పాటు సొంతింటి కలను నెరవేర్చిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– పి.మాబుచాన్, అశోక్‌నగర్, బద్వేలు

రెండు రోజుల్లోనే ధ్రువపత్రాలు



కుల, ఆదాయ ధ్రువ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవడమే ఆలస్యం. వెంటనే వలంటీర్ ద్వారా ధ్రువపత్రాలు మా ఇంటి వద్దకే తీసుకువచ్చి ఇచ్చారు. గతంలో ధ్రువపత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. అవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి ఉండేది. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువపత్రాలన్నీ కూడా ఉచితంగానే ఇస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువపత్రాలు మాకు అందాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేలు మేము ఎప్పటికీ మరిచిపోలేము.

– బాదిరెడ్డి లక్ష్మీదేవి, కాలువపల్లి, గోపవరం

తగ్గనంటున్న పసుపు ధర

క్వింటాల్ అత్యధిక ధర రూ. 10,365


కడప మార్కెట్ యార్డుకు వచ్చిన పసుపు

కడప అగ్రికల్చర్ : పసుపు ధర తగ్గనంటోంది. గత కొద్ది రోజులుగా క్వింటాల్ రూ. 10 వేలు పైనే ధర కొనసాగుతోంది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా మార్కెట్‌లో బల్బుకంటే ఫింగర్ ధర ఎప్పుడూ కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. కానీ గురువారం రోజు మాత్రం ఇందుకు భిన్నంగా ఫింగర్ ధర కంటే బల్బు ధర కొద్దిగా అధికంగా పలికింది. కడప మార్కెట్ యార్డులో క్వింటాల్ ఫింగర్ పసుపు అత్యల్ప ధర రూ.6800 పలుకగా అత్యధిక ధర రూ. 10,200 పలికింది. అలాగే బల్బు పసుపు అత్యల్ప ధర రూ.6800 పలకగా అత్యధిక ధర క్వింటా రూ. 10365 పలికింది. ఈ ధర అటు ఇటుగా గత నెల రోజుల నుంచి కొనసాగుతోంది. ఇదిలా ఉండగా చాలామంది రైతులు తర్వాత ధర ఉంటుందో లేదోనని భయపడి సీజన్‌లోనే పసుపును అమ్ముకున్నారు. కానీ పరిస్థితి ఇప్పుడు భిన్నంగా ఉంది. ముందుగా పసుపు మ్ముకున్న రైతులు మాత్రం కొంత నష్టపోయారనే చెప్పాలి.

భార్యను హత్య చేసిన కానిస్టేబుల్

- మద్యం, డబ్బు, వ్యసనాలే హత్యకు కారణం
- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు


హత్యకు గురైన జానకి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని జెండామాను వీధి సమీపంలో నివాసముంటున్న బైరి వసుంధర అలియాస్ జానకి (30) అనే వివాహితను ఆమె భర్త, కానిస్టేబుల్ బైరి బాలవాసు హత్య చేశాడు. గురువారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి మృతురాలి తండ్రి ఈశ్వరయ్య కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 13 ఏళ్ల క్రితం ప్రొద్దుటూరులోని డ్రైవర్స్ కాలనీలో నివాసముంటున్న కానిస్టేబుల్ బాలవాసుతో జానకికి వివాహమైంది. వీరికి ఒక పాప, ఒక బాబు ఉన్నారు. మద్యానికి బానిసైన బాలవాసు జానకితో నిత్యం గొడవ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో నెలక్రితం పులివెందులలోని జెండామాను వీధిలో చేరారు. అక్కడ కూడా మద్యం తాగి.. అప్పులు ఎక్కువై తరచూ గొడవ పడుతుండేవాడు. గతంలో బాలవాసు కడపలోని ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఉండటం వల్ల పెద్ద మనుషులతో మాట్లాడి పంచాయితీ చేశారు. ఆ తర్వాత పులివెందులలో సంసారం పెట్టినా అతని వైఖరిలో మార్పు రాలేదు. జానకిని చిత్ర హింసలకు గురి చేసేవాడు. ఈ క్రమంలో బాలవాసు మృతురాలి బంధువులకు ఫోన్ చేసి తాను తన భార్యను గొంతు నులిమి చంపానని చెప్పాడు. దీంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా జానకి బాత్రూంలో పడిపోయి ఉంది. తమ బిడ్డ హత్యకు అల్లుడు బాలవాసు కారణమని మృతురాలి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సంఘటనా స్థలాన్ని అర్బన్ సీఐ రాజు, ఎస్ఐ అరుణ్‌రెడ్డి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అన్నమయ్య జిల్లాలో సారా తగ్గుముఖం

అడిషనల్ ఎస్పీ డాక్టర్ బి.వి. రాజ్‌కమల్

పీలేరురూరల్ : జిల్లాలో సారా తయారీ, విక్రయాలు తగ్గముఖం పట్టినట్లు అడిషనల్ ఎస్పీ డాక్టర్ బి.వి. రాజ్‌కమల్ తెలిపారు. గురువారం పీలేరు సెబ్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, పట్టుబడిన వాహనాలు, మద్యాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది 60 శాతం సారా తీయారీ, విక్రయాలు తగ్గుముఖం పట్టాయన్నారు. జిల్లాలో నలుగురిపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేశామన్నారు. జిల్లాలో సారా తయారీని వదిలేసి పరివర్తన చెందిన 200 మందికి వారి జీవనోపాధికి ప్రభుత్వం రూ. 1,78,34,500 రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. తద్వారా ఆవులు, ఆటోలు, చిల్లర దుకాణాలు పెట్టుకుని జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం రాకుండా పోలీస్, సెబ్ సంయుక్తంగా ప్రత్యేకంగా చెక్‌పోస్టులు, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బి. వినోద్‌కుమార్ నాయక్, సెబ్ సీఐ గురుప్రసాద్, ఎస్ఐ లక్ష్మీనరసయ్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ఇళ్ల వద్దే పశువులకు చికిత్స

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 14 డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలు
- వాహనాలను తనిఖీ చేసిన జీవీకే సంస్థ రీజినల్ మేనేజర్ కలీమ్


1962 వాహనంలోని మందులను పరిశీలిస్తున్న రీజినల్ మేనేజర్ కలీమ్

ప్రొద్దుటూరు క్రైం : అత్యవసర సమయంలో రైతుల ఇంటి వద్దకు వెళ్లి డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాల ద్వారా పశువులకు మెరుగైన చికిత్సను అందిస్తున్నామని జీవీకే సంస్థ రీజినల్ మేనేజర్ కలీమ్ తెలిపారు. 1962 వాహనాలను తనిఖీ చేసేందుకు గురువారం ఆయన ప్రొద్దుటూరుకు వచ్చారు. వాహనాలను తనిఖీ చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు ఇళ్ల వద్దనే మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను ప్రవేశ పెట్టిందన్నారు. అత్యవసర సమయంలో రైతులు 1962 నంబర్‌కు ఫోన్ చేయగానే తమ సిబ్బంది వెంటనే ఆయా గ్రామాలకు చేరుకొని రైతుల కళ్ల ముందే వారి పశువులకు ఉచితంగా చికిత్సను అందిస్తారని చెప్పారు. చికిత్సతో పాటు మందులు కూడా రైతులకు ఇస్తారని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో 14 వాహనాలు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 1962 అంబులెన్స్‌లు 14 ఉన్నట్లు రీజినల్ మేనేజర్ కలీమ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 340 వాహనాలు ఉన్నాయన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక వాహనం చొప్పున ఉన్నాయని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయత్రం 5 గంటల వరకు రైతులకు ఈ సేవలను అందిస్తామన్నారు. 1962 వాహనం ద్వారా ప్రతి రోజు ఒక్కో నియోజకవర్గంలో 8- 10 కేసులు చూస్తున్నట్లు ఆయన తెలిపారు. చికిత్స అనంతరం కాల్ సెంటర్ సిబ్బంది రైతులకు ఫోన్ చేసి పశువుల స్థితిగతులను తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు చదిపిరాళ్ల విద్యార్థిని ఎంపిక



కమలాపురం : మండల పరిధిలోని టి.చదిపిరాళ్లకు చెందిన 7వ తరగతి విద్యార్థిని చాగారి ఆశ్రితరెడ్డి జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు విద్యార్థిని తండ్రి పీఈటీ చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నంద్యాలలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో ఆశ్రితారెడ్డి పాల్గొని ఈపీ విభాగంలో వ్యక్తిగతంలోనూ, టీం చాంపియన్‌షిప్‌లోనూ అత్యంత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. 2024 జనవరిలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే 67వ జాతీయ స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఆశ్రితారెడ్డి చాగలమర్రిలోని సెయింట్ అన్నేస్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతోందని ఆయన వివరించారు.

'ఆడుదాం ఆంధ్ర' ట్రయల్ మ్యాచ్‌లు విజయవంతం

– ప్రారంభించిన డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి


'ఆడుదాం ఆంధ్ర' సన్నాహక మ్యాచ్‌లో పాల్గొన్న అధికారులు, క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' మెగా క్రీడాటోర్నమెంట్‌కు సంబంధించిన సన్నాహక మ్యాచ్‌లు విజయవంతంగా ప్రారంభమయ్యాయి. గురువారం కడప నగరంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో నిర్వహించిన ట్రయల్ మ్యాచ్‌లను డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తోందన్నారు. డిసెంబర్ 15న ప్రారంభం కావాల్సిన మ్యాచ్‌లు.. మరోవారం పాటు వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆడుదాం ఆంధ్ర స్పోర్ట్స్ అంబాసిడర్, టెన్నిస్ మెడలిస్టు అబిగేల్, స్థానిక కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు, నగరపాలక అధికారులు విజయభాస్కర్‌గౌడ్, శ్రీనివాసులు, హరిప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. ప్రవీణ్‌కిరణ్, సాజిద్, నిత్యప్రభాకర్, శ్రీనివాసులరెడ్డి, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, కోచ్‌లు అమృత్‌రాజ్, అబ్దుల్ మునాఫ్, శ్రీనివాసరాజు, కల్యాణ్, శ్రీధర్, సుదర్శన్‌సిద్ధిక్, విలియం కేరీ, శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి మహిళకు తీవ్ర గాయాలు

పీలేరురూరల్ : రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని పింఛా నది బ్రిడ్జికి అవతల రైల్వే ట్రాక్ పక్కన మహిళ పడి ఉండగా గమనించిన రైల్వే క్యామెన్ సుబ్రమణ్యం హుటాహుటిన ఆమెను 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె ఎవరైంది ఎలాంటి ఆధారాలు లేవు.

అక్రమంగా మద్యం రవాణా కేసులో ఇద్దరికి జైలు

రాయచోటిటౌన్ : కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న ఘటనలో ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.2లక్షల జరిమానా విధిస్తూ రాయచోటి కోర్టు ఏజేఎఫ్‌సీఎం డాక్టర్ శారద తీర్పు చెప్పారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ధీరజ్ రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2021 సంవత్సరం నవంబర్ 17న రాయచోటి – చిత్తూరు రింగ్ రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా బంగారుపేటకు చెందిన బత్తుల శశిధర్, చిన్నమండెం మండలం వండాడి తూర్పుపల్లెకు చెందిన యండపల్లె సాయి ప్రతాప్‌రెడ్డిలు ఆటోలో కర్ణాటక మద్యం బాటిళ్లు తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వారు రాయచోటి ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు అంగీకరించారన్నారు. ఈ కేసు ప్రభుత్వం తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.సుజాత వాదించారు.

ధనుర్మాసంలో వైష్ణవాలయాల దర్శిని

మైదుకూరు : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని పలు వైష్ణవాలయాలను దర్శించుకునేందుకు మైదుకూరు డిపో నుంచి ప్రత్యేక ప్యాకేజీ టూర్ బస్సులను నడుపుతున్నట్లు మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి శుక్రవారం రాత్రి 7 గంటలకు మైదుకూరు నుంచి బస్సులు బయల్దేరుతాయని ఆయన పేర్కొన్నారు. శనివారం ఉదయం 7 గంటలకు మంగళగిరి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి దర్శనం, 9 గంటలకు విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం, మధ్యాహ్నం 12.30 గంటలకు ద్వారకాతిరుమలలో స్వామివారి దర్శనం, సాయంత్రం 7 గంటలకు అన్నవరం సత్యనారాయణ స్వామి దర్శనం ఉంటాయని, రాత్రికి అక్కడే బస ఉంటుందని వివరించారు. ఆదివారం ఉదయం బస్సులు బయల్దేరి సింహాచల క్షేత్రాన్ని చేరుకుంటాయని, 9 గంటలకు స్వామివారి దర్శనం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి అక్కడి నుంచి బయల్దేరి సోమవారం ఉదయం 7 గంటలకు మైదుకూరు చేరుకుంటాయని తెలిపారు. ఈ క్షేత్రాలకు లగ్జరీ 2 ప్లస్ 2 బస్సుల్లో రానుపోను చార్జీ రూ.3వేలు అని డీఎం పేర్కొన్నారు.

వేళాంగిణికి ప్రత్యేక బస్సులు

క్రిస్మస్ వేడుకల సందర్భంగా వేళాంగిణి క్షేత్రానికి ప్రత్యేక టూర్ ప్యాకేజీ బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి శుక్రవారం రాత్రి 7 గంటలకు మైదుకూరు డిపో నుంచి బస్సులు బయల్దేరుతాయని ఆయన పేర్కొన్నారు. బస్సులు మైదుకూరు, కడప, నాగూరు, నాగపట్నం మీదుగా శనివారానికి వేళాంగిణి చేరుకుంటాయని తెలిపారు. ఆదివారం వేళాంగిణి చర్చిలో దర్శనం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి బస్సులు బయల్దేరి సోమవారం తెల్లవారుజామున మైదుకూరుకు చేరుకుంటాయన్నారు. లగ్జరీ 2 ప్లస్ 2 సీట్లు గల బస్సుల్లో రాను పోను చార్జీ రూ.2,230 అని తెలిపారు.

ఏసీబీ వలలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్

నేతన్ననేస్తం, చేదోడు పథకాలకు లంచం తీసుకుంటుండగా పట్టివేత



మదనపల్లె : చేనేతలను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేతన్ననేస్తం, చేదోడు పథకాలకు అర్హత కల్పిస్తానని, ఓ లబ్ధిదారుడి నుంచి రూ.5వేలు లంచం తీసుకుంటూ అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం కోళ్లబైలు-2 గ్రామసచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కుమార్ ఏసీబీకి పట్టుబడ్డాడు. కడప ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కోళ్లబైలు వెల్ఫేర్ అసిస్టెంట్ కుమార్ కోళ్లబైలు-1 గ్రామసచివాలయానికి ఇన్‌చార్జ్‌గా, 2 సచివాలయానికి రెగ్యులర్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను విధులు నిర్వహిస్తున్న రెండు సచివాయాల పరిధిలో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పథకాల మంజూరుకు సంబంధించి పథకం మొత్తంలో సగం డబ్బులు తనకు ఇవ్వాల్సిందేనని వెల్ఫేర్ అసిస్టెంట్ కుమార్ డిమాండ్ చేసేవాడు. ఇవ్వకపోతే పథకాలకు అనర్హులను చేయడం, హోల్డ్‌లో పెట్టడం, ఇచ్చిన తర్వాత తిరిగి మంజూరయ్యేలా చేయడం చేసేవాడు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు సర్పంచ్ బండి చంద్రకళ, నాయకులు మనోహర్‌కు ఫిర్యాదు చేశారు. వారు హెచ్చరించినా అతడిలో ఏ మాత్రం మార్పు కనిపించలేదు. దీంతో పలువురు బాధితులు జగనన్నకు చెబుదాం(స్పందన) కాల్‌సెంటర్‌కు ఈనెల 13న ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు ఒకరి సహాయంతో వెల్ఫేర్ అసిస్టెంట్ కుమార్‌కు డబ్బులు ఇస్తామని ఆశచూపి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోకి రావాల్సిందిగా కోరారు. అక్కడ ఫిర్యాదుదారుడు రూ.5వేలు లంచం వెల్ఫేర్ అసిస్టెంట్ కుమార్‌కు ఇస్తుండగా, ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్కడి నుంచి కోళ్లబైలు-2 సచివాలయానికి తీసుకెళ్లి విచారించారు. నిందితుడు నేరం అంగీకరించడంతో కేసు నమోదు చేసి, నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1902, 14400కు ఫిర్యాదుచేస్తే కేసు నమోదుచేసి చర్యలు తీసుకుంటామన్నారు.